వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లి రైతులతో మాట్లాడుతున్న 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

మెడికల్ కాలేజీకి మా భూములివ్వం

- సాగు భూములు వదిలి ఎక్కడికి పోవాలి?
- కొడంగల్‌లో అభిప్రాయ సేకరణలో తేల్చి చెప్పిన రైతులు
- ఉద్యోగాలు, పారితోషికం ఇస్తామన్న అధికారులు
- భూములు వదులుకునే ప్రసక్తేలేదన్న రైతన్నలు

కొడంగల్, ఫిబ్రవరి 8: వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం సాగు భూములు ఇవ్వలేమని రైతులు తేల్చి చెప్పారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములను వదులుకొని ఇప్పుడు తాము ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. పరిహారం చెల్లించినా భూములిచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 19 సర్వే నంబర్‌లోని రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అప్పాయిపల్లిలోని సర్వే నంబర్ 19లోని భూములు మెడికల్ కాలేజీ ఏర్పాటుకు అనువుగా ఉంటుందని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిపారు. భూములు ఇచ్చిన వారికి నష్టపరిహారంతోపాటు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అసైన్డ్ భూమిలో మొత్తంగా 74 ఎకరాల్లో 47 మంది రైతులు ఉన్నారని, వారి అభిప్రాయం సేకరించేందుకు వచ్చినట్టు తెలిపారు. తాము దాదాపు 70 ఏండ్లుగా ఈ భూములనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని రైతులు తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ భూమి అని తీసుకొంటే తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని కోల్పోతే మళ్లీ భూములను కొనుగోలు చేసుకునే శక్తి తమకు లేదని వాపోయారు. నష్టపరిహారం ఇచ్చినా తాము భూములను వదులుకునేందుకు సిద్ధంగా లేమని వారు స్పష్టం చేశారు. అభిప్రాయసేకరణలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గుట్ట కాలేజీని తరలిస్తే ఊరుకోం

- కొడంగల్‌కు తరలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ కుట్ర
- కేసీఆర్ దయతో యాదగిరిగుట్టకు వైద్య కళాశాల మంజూరు
- ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలి
- లేదంటే మార్చి 1నుంచి రిలే దీక్ష: మాజీ ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరిక

గుట్టలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 8 : కేసీఆర్ సర్కార్ యాదగిరిగుట్టకు మంజూరు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించేందుకు యత్నిస్తున్నారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆరోపించారు. కష్టపడి సాధించిన వైద్య కళాశాలను తరలిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. నెలాఖరులోగా గుట్టలోని వైద్య కళాశాలకు శంకుస్థాపన చేసిన వంద పడకల దవాఖానను నిర్మించడంతోపాటు మల్లాపురం సర్వే నంబర్ 64లో వైద్య కళాశాలను నిర్మించేందుకు పనులు ప్రారంభించాలని, లేకపోతే మార్చి ఒకటి నుంచి గుట్టలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. గురువారం ఆమె యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రూ. 1,250 కోట్లతో యాదగిరిగుట్ట దేవస్థానాన్ని ప్రపంచమే గర్వపడే విధంగా కేసీఆర్ తీర్చిదిద్దినట్టు కొనియాడారు. జిల్లాలో ఎయిమ్స్ వైద్యశాల ఉన్నప్పటికీ పేదలకు ఎలాంటి సేవలు అందడం లేదని అన్నారు. యాదగిరిగుట్టకు ప్రభుత్వ మెడికల్ కళాశాల కావాలని కొట్లాడి తెచ్చుకున్నామని తెలిపారు. కేసీఆర్ రూ.183 కోట్లు కేటాయించి 2023 జూలై 5న యాదగిరిగుట్టకు 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యం కలిగిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అవసరమైతే కొడంగల్‌కు కొత్తగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసుకునే వీలున్నదని సూచించారు. అంతేగాని ఇక్కడి నుంచి తరలించడం సరికాదని అన్నారు. నెలాఖరు వరకు మెడికల్ కళాశాలపై స్పష్టతనివ్వాలని, తమ విజ్ఞప్తిని పట్టించుకోకపోతే ఉద్యమానికి తెర లేపుతామని హెచ్చరించారు.

లోకం పోకడ

ఈ ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించమని, మా బతుకులు బాగుపడాలని లక్ష్మీనరసింహస్వామిని మేడుకుంటాం!

ఓటర్లు 3.3 కోట్లు

▸ మొదటిపేజీ తరువాయి...

తొలగించామని, 4,21,521 మంది ఓటర్లు చిరునామా మార్పు, పేర్ల సవరణ చేసుకున్నట్టు వివరించారు. మొత్తం ఓటర్లలో 80 ఏండ్లు దాటినవారు 4,54, 230 మంది ఉండగా, దివ్యాంగులు 5,28,405 మంది ఉన్నట్టు తెలిపారు. స్త్రీపురుష ఓటర్ల నిష్పత్తి 1000:1009గా ఉన్నట్టు పేర్కొన్నారు. 18, 19 ఏండ్ల వయసున్న కొత్త ఓటర్ల నిష్పత్తి 754 నుంచి 791కి చేరినట్టు వివరించారు. ఓటర్ల జాబితా సవరణ నిరంతర ప్రక్రియ అని వచ్చే ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏండ్లు పూర్తిచేసుకున్న వారు త దుపరి ఓటర్ల జాబితా సవరణలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కు చెక్ చేసుకోవడానికి https:// voters.eci. gov.in వెబ్ సైట్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా చెక్ చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో ఓటర్ల వివరాలు

మహిళలు	1,64,47,132
పురుషులు	1,65,87,244
థర్డ్ జెండర్	2,737
మొత్తం ఓటర్లు	3,30,37,113
సర్వీసు ఓటర్లు	15,378
ఓవర్‌సీస్ ఓటర్లు	3,399

మళ్లీ శేరిలింగంపల్లిదే అగ్రస్థానం

అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా గత కొన్నేండ్లుగా అగ్రస్థానంలో కొనసాగుతున్న శేరిలింగంపల్లి మరోమారు టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇక్కడ మొత్తం 7,47,726 మంది ఓటర్లు ఉన్నారు. 7,12,868 ఓటర్లతో కుత్బుల్లాపూర్, 7,12,868 మంది ఓటర్లతో మేడ్చల్ వరుసగా రెండుమూడు స్థానాల్లో నిలిచాయి. ఆ తర్వాత వరుసగా ఎల్బీనగర్ (6,00,500), రాజేంద్రనగర్ (5,99,678), మహేశ్వరం (5,56,054), ఉప్పల్ (5,33,702) నిలిచాయి. అతి తక్కువగా భద్రాచలంలో 1,51,940 మంది ఓటర్లు ఉండగా, అశ్వారావుపేటలో 1,58,274, బెల్లంపల్లిలో 1,75,508, చెన్నూరులో 1,93,379, బాన్సువాడలో 1,95,887, దుబ్బాకలో 1,99,294 మంది ఓటర్లు ఉన్నారు.

కాంగ్రెస్ వసూళ్ల పర్వం

- రియల్ ఎస్టేట్ వ్యాపారులను పిలిపించి బెదిరిస్తున్నారు
- తెలంగాణ డబ్బును ఎన్నికల్లో దేశమంతా పంచాలనుకుంటున్నారు
- కిషన్‌రెడ్డి ఆరోపణ..బీజేపీలో ఎవరొచ్చినా చేర్చుకుంటామని వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే వసూళ్లకు తెరలేపిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీ పెద్దలు టార్గెట్ పెట్టారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులను, బిల్డర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటకలో దోచుకున్న డబ్బును ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పంచారని, ఇదే తరహాలో ఇప్పుడు తెలంగాణలో డబ్బు దోచుకొని దేశమంతా పంచేందుకు సిద్ధం అవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి సూట్‌కేసులు మోసేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల గురించి బీజేపీ కేంద్ర నాయకత్వంతో మాట్లాడానని, శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిటీ సమావేశం అవుతుందని తెలిపారు. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయ సేకరణ జరిగిందని చెప్పారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి ముగ్గురు నుంచి ఐదుగురు అభ్యర్థులను ఎంపిక చేస్తామని అన్నారు. త్వరలో ఐదారు మందితో తొలిజాబితా విడుదల చేస్తామని, ఆ తర్వాత తుది జాబితా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణం బీజేపీకి చాలా అనుకూలంగా ఉన్నదని అంటూ.. 17 సీట్లలో ఒంటరిగా పోటీ చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల నుంచి బీజేపీలో చేరేందుకు ఉత్సాహంగా వస్తున్నారని, ఎవరొచ్చినా చేర్చుకుంటామని అన్నారు.

16లోగా ఎంపీ అభ్యర్థుల జాబితా

బీజేపీ ఈ నెల 16 లోగా ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల చేసే అవకాశం ఉన్నది. బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్, ఇతర ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యనేతలు ఇటీవలే రాష్ట్రంలోని బీజేపీ మండల అధ్యక్షులు, ఆపై స్థాయి నేతల నుంచి అభ్యర్థుల గురించి ఆరా తీశారు. ఈ మేరకు ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు ఆశావహుల జాబితాను సిద్ధం చేసినట్టు సమాచారం. తొలివిడుతగా.. సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్, చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భువనగిరి నుంచి బూర నర్సయ్యగౌడ్, మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ పేర్లు దాదాపు ఖరారైనట్టు తెలిసింది. వీరి పేర్లను త్వరలో ప్రకటించనున్నారు. సిట్టింగ్‌లలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుకు మొండిచేయి చూపించే అవకాశం ఉన్నది. జితేందర్‌రెడ్డి తన కుమారుడికి అసెంబ్లీ టిక్కెట్ ఇప్పించుకున్న నేపథ్యంలో ఆయనకు ఎంపీ టిక్కెట్ దక్కదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. పెద్దపల్లి, మహబూబ్‌బాద్, నాగర్‌కర్నూల్, వరంగల్, జహీరాబాద్, ఆదిలాబాద్‌లో జంపింగ్ నేతల కోసం ఎదురుచూస్తున్నట్టు సమాచారం. మల్కాజిగిరిపై ఎక్కువ మంది నేతలు పట్టుబడుతుండటంతో నిర్ణయాన్ని కేంద్ర పెద్దలకు వదిలేసినట్టు సమాచారం.

కరీంనగర్ కాంగ్రెస్‌లో షోకాజ్‌ల రచ్చ

- ఎన్నికల్లో ప్రచారానికి రూ.కోటి అడిగారంటూ నరేందర్‌రెడ్డిపై పురమల్ల ఫిర్యాదు
- నరేందర్, రోహిత్‌కు షోకాజ్ నోటీసులు
- వారి వివరణతో పురమల్లకు షోకాజ్
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

కరీంనగర్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తన ఓటమికి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి రోహిత్‌రావే కారణమంటూ ఆ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పురమల్ల శ్రీనివాస్ ఈనెల 1న టీపీసీసీ క్రమశిక్షణ సంఘం (డీఏసీ)కు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. తనకు అనుకూలంగా ప్రచారం చేసేందుకు నరేందర్‌రెడ్డి కోటి రూపాయలు డిమాండ్ చేశారని ఆరోపించారు. అందులో భాగంగా ఓ ప్రజాప్రతినిధి ముందే ఆయనకు రూ. 20 లక్షలు ఇచ్చి మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంతా చేస్తే వారిద్దరూ తనకు వ్యతిరేకంగా పనిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావుకు భవిష్యత్తులో ఎలాంటి పదవులు ఇవ్వకుండా అడ్డుకోవడంతోపాటు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి నాలుగైదు రోజుల క్రితం నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావుకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారిద్దరూ ఈ నెల 5న వివరణ ఇస్తూ శ్రీనివాస్ ఓటమికి ఆయనే కారణమని పేర్కొంటూ అందుకు తగిన ఆధారాలను అధిష్ఠానానికి అందించినట్టు తెలిసింది. ఆయన ఓటమిలో తమ పాత్ర ఏమీలేదని, బీఆర్‌ఎస్, బీజేపీకి పరోక్షంగా సహకరించారని ఆరోపించారు. అధిష్ఠానం సమాచారాన్ని తమకు ఇవ్వకపోగా, ఆదేశాలను పెడచెవిన పెట్టారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలను పట్టించుకోలేదని, అసమర్థత, నిర్లక్ష్యం వల్లే మూడోస్థానంలో నిలిచారని వివరించారు. దీనిపై సీరియస్‌గా స్పందించిన క్రమశిక్షణ సంఘం చైర్మన్ జీ చిన్నారెడ్డి పురమల్లకు షోకాజ్ నోటీసు జారీచేసి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించడం పార్టీలో చర్చకు దారితీసింది.

పింఛనో రామచంద్రా!

▸ మొదటిపేజీ తరువాయి...

నెలనెలా ఇచ్చి అసహాయులకు ఆసరాగా నిలిచింది. పింఛన్లు ఇవ్వడంలో కేసీఆర్ ప్రభుత్వంలోనే నయమంటూ పలువురు లబ్ధిదారులు చెప్పుకుంటుండటం గమనార్హం.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.20 లక్షల మంది లబ్ధిదారులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,20,862 మంది ఆసరా పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.26.54 కోట్లు పంపిణీ చేయాల్సి ఉన్నది. అందులో వృద్ధులు 33,503 మంది, దివ్యాంగులు 10,073, వితంతు 24,492, చేనేత 3,691, కల్లు గీత 2,346, ఒంటరి మహిళలు 1,833, బీడీ కార్మికులు 43,381, బోదకాలు బాధితులు 1,004, డయాలసిస్ బాధితులు 67, బీడీ టేకేదారులు 472 మంది చొప్పున లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ నిరుడు డిసెంబర్‌లో నవంబర్ నెల పింఛన్ సొమ్మును వారి ఖాతాల్లో వేశారు. రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఆసరా పింఛన్ సొమ్ము అతీగతీ లేదు. ఎప్పుడు వస్తాయో కూడా తెలియదని అధికారులు చెప్తుండటం గమనార్హం. ఈ జిల్లాలో అత్యధికంగా బీడీ కార్మికులు, చేనేత కుటుంబాలే ఉన్నాయి. వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని గుర్తించి కేసీఆర్ ప్రభుత్వం బీడీ, నేతన్నలు, ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేసింది. వాటితోనే బతుకీడుస్తున్న తమ పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆసరా అందించాలని కోరుతున్నారు.

కేసీఆర్ సర్కారున్నా పింఛనొత్తుండె!

మాది నేత కుటుంబం. అమ్మ బీడీలు చుడుతుంది. నాన్న మరమగ్గాల కార్మికుడు. చిన్నప్పుడు పోలియో వచ్చి కాళ్లు చచ్చుబడిపోయినయ్. వీపులో పెద్ద కంతి ఉంది. కేటీఆర్ సారు గిఫ్ట్ ఏ స్మయిల్ కింద నాకు త్రీవీలర్ స్కూటర్ ఇచ్చిండు. దానిపైన అగ్రహారంలోని డిగ్రీ కాలేజీకి పోతున్న. వచ్చే పింఛన్ రూ.4016తో చదువుకుంటున్న. రెండు నెలల నుంచి పింఛనొత్తలేదు. స్కూటర్‌లో పెట్రోలు పోయించుకోలేక దినం విడిచి దినం కాలేజీకి పోతున్న. చదువు ఎక్కడ బంద్ అయితదోనని భయపడుతున్న. కేసీఆర్ సర్కారున్నా మాకు పింఛన్ వస్తుండె.

- వెల్డి గణేశ్, దివ్యాంగుడు, సిరిసిల్ల

సకాలంలో పింఛన్ ఇవ్వండి: మామిడాల నరేశ్

పింఛన్ల కోసం సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల దివ్యాంగుల ఎదురుచూపులు

కోనరావుపేట, ఫిబ్రవరి 8: దివ్యాంగులందరికీ సకాలంలో పింఛన్ సొమ్మును అందజేయాలని దివ్యాంగుల అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకుడు మామిడాల నరేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పింఛన్ సొమ్ము అందని కారణంగా సిరిసిల్లలోని కాలేజీ గ్రౌండ్‌లో పలువురు దివ్యాగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ దివ్యాంగులకు శారీరక, ఆర్థిక సంబంధమైన సమస్యలు ఉన్నాయని, సకాలంలో పింఛన్ అందితేనే ఆర్థికంగా ఉయోగపడుతుందని చెప్పారు. కొంతమందికి పింఛన్ వస్తేనే కుటుంబం గడుస్తుందని, ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సమావేశంలో మంగళారపు రాజేందర్, హరిప్రసాద్, మన్మోహన్, ప్రశాంత్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలివ్వండి మహాప్రభో!

- ఆకలితో అలమటిస్తున్న ఆశావర్కర్లు
- రెండు నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు
- రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు సిద్ధం
- నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నా

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రెండు నెలలుగా వేతనాలు అందక ఆశావర్కర్లు అల్లాడిపోతున్నారు. జీతాల రూపంలో వీరికిచ్చే చిన్నపాటి మొత్తాన్ని కూడా బడ్జెట్‌తో ముడిపెట్టి రెండు నెలలుగా తిప్పించుకుంటున్నారు. కేసీఆర్ హయాంలో ప్రతినెలా రెండో తేదీనే వేతనాలు అందుకునే ఆశావర్కర్లు ఇప్పుడు వేతనాల కోసం రెడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొన్నది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 28 వేల ఆశావర్కర్లు సేవలు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా వీరు నియమితులైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్ని పనులకు వీరినే పురమాయిస్తున్నది. ఇంతా చేస్తే వీరికి ఇచ్చేది నెలకు రూ. 9,700 వేతనం మాత్రమే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఇప్పటి వరకు అంటే డిసెంబర్, జనవరి వేతనాలు వీరికి ఇప్పటి వరకు అందలేదు. వేతనాలు విడుదల చేయాలంటూ రోజులు తరబడి వీరు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వేతానాలివ్వండి మహాప్రభో అని సంబంధితశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కమిషనర్, డైరెక్టర్‌కు వినతిపత్రాలు కూడా అందించినా వారి నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. మూడు రోజుల క్రితం నగరంలోని 1800 మంది ఆశా వర్కర్లు హైదరాబాద్ డీహెచ్‌ఎంవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం సమర్పించారు. పలుచోట్ల సంబంధిత పీహెచ్‌సీ వైద్యులకు సమ్మె నోటీసు ఇస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా చేపడుతున్నట్టు ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షురాలు జయలక్ష్మి తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీల నియామకాలపై స్టేటస్ కో పొడిగింపు

- ప్రతివాదులుగా కోదండరాం, అమీర్ అలీఖాన్
- పిటిషన్ల విచారణార్హతపై వాడివేడిగా వాదనలు
- నేడూ కొనసాగనున్న విచారణ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకపు అమలును నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టు గురువారం మరోసారి పొడిగించింది. తుది ఉత్తర్వులు వెలువడే వరకు గత నెల 30న వెలువరించిన మధ్యంతర స్టేటస్ కో ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ కేసులో కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను ప్రతివాదులుగా చేర్చుతూ దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లను హైకోర్టు అనుమతించింది. వారిద్దరినీ ప్రతివాదులుగా పరిగణించి నోటీసులు జారీచేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ శుక్రవారం కొనసాగనుంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా మంత్రి వర్గ ఆమోదంతో ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలను నియమించాలని గత ప్రభుత్వం గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపింది. వారి నామినేషన్లను తిరస్కరిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని దాసోజు, కుర్ర వేర్వేరుగా హైకోర్టులో సవాల్ చేశారు.

కేసీఆర్ ప్రభుత్వంపై గవర్నర్ బాహాట నిరసన

కేవలం కేసీఆర్ ప్రభుత్వంపై వ్యతిరేకత కారణంగానే గవర్నర్ వారి నామినేషన్లను తిరస్కరించారని దాసోజు, కుర్ర తరఫు న్యాయవాదులు వాదించారు. కుర్ర సత్యనారాయణ ఎస్సీ వర్గానికి చెందిన కార్మిక నాయకుడని, దాసోజు బీసీ వర్గానికి చెందినవారని, పీఆర్పీ వ్యవస్థాపకుల్లో ఒకరని, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధిగా ఉన్నారని చెప్పారు. వీరు రాజకీయాల్లో ఉన్నారన్న నెపంతో గవర్నర్ వారిని తిరస్కరించడం దారుణమని అన్నారు. పలు రాష్ట్రాల్లో రాజకీయాల్లో ఉన్నవారినే అక్కడి గవర్నర్లు నామినేట్ చేశారని తెలిపారు. గవర్నర్‌కు ప్రభుత్వానికి మధ్య విభేదాలు ఉంటే వాటిని రాజ్యాంగ పరమైన పదవుల భర్తీ వ్యవహారంలో చూపకూడదని చెప్పారు.

గవర్నర్ చర్య రాజ్యాంగ విరుద్ధం

రాజకీయనేతలని చెప్పి దాసోజు, కుర్ర నామినేషన్లను తిరస్కరించిన గవర్నర్.. ఓ రాజకీయపార్టీని స్థాపించిన కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను నియమించేందుకు చకచకా చర్యలు తీసుకున్నారని చెప్పారు. వీరిద్దరి విషయంలో గవర్నర్ ఆగమేఘాల మీద నియామక ప్రక్రియ పూర్తి చేశారని వివరించారు. ఓవైపు ఇదే హైకోర్టులో పిటిషనర్లు దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ జరుగుతుండగానే గవర్నర్ ఎందుకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని న్యాయవాదులు ప్రశ్నించారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ ఆమోదం చెప్పాలని, తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని చెప్పారు. గవర్నర్ దురుద్దేశపూరిత నిర్ణయాలు తీసుకుంటే వాటిని న్యాయ సమీక్ష చేయవచ్చునని సుప్రీంకోర్టు పలు కేసుల్లో తీర్పులు చెప్పిందని తెలిపారు. మంత్రివర్గం రెండోసారి చేసే సిఫార్సులను గవర్నర్ ఆమోదించి తీరాల్సిందేనని అన్నారు.

గత తీర్మానం రద్దు: ఏజీ సుదర్శన్‌రెడ్డి

దాసోజు, కుర్రాలను ఎమ్మెల్సీలుగా నియమించాలని కేసీఆర్ మంత్రివర్గం 2023 జూలై 31న చేసిన తీర్మానాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. గవర్నర్ మంత్రివర్గ సిఫారసులను తిరస్కరించిన తర్వాత దానిపై మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో పిటిషనర్ల పేర్లను తొలగించి, తిరిగి తాజా నిర్ణయం తీసుకునే క్రమంలోనే మరో ఇద్దరి పేర్లను సిఫార్సు చేసిందని చెప్పారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేసేందుకు ఆస్కారం లేదని, పిటిషన్లు విచారణార్హం కాదని అన్నారు. కోదండరాం, అలీఖాన్‌ల పేర్లకు గవర్నర్ ఆమోదం చెప్పడంతో గెజిట్ నోటిఫికేషన్ కూడా వెలువడిందని చెప్పారు. ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఉన్నాయని చెప్పారు. రాజ్యాంగంలోని అధికరణ 381 కింద గవర్నర్‌కు ప్రత్యేక రక్షణ ఉందని.. గవర్నర్ కార్యాలయం తరపు సీనియర్ న్యాయవాది ఎస్ అశోక్ ఆనంద్ కుమార్ చెప్పారు. గవర్నర్ తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించేందుకు వీల్లేదన్నారు.

వివస్త్రను చేసి.. కారం కొట్టి..

▸ మొదటిపేజీ తరువాయి...

మారింది. వివాహేతర సంబంధం ఘటనలో కొందరు ఓ దళిత మహిళను వివస్త్రను చేసి జననాంగాల్లో కారం కొట్టి చిత్రహింసలకు గురి చేశారు. గ్రామంలో నడిబజారులో అందరు చూస్తుండగానే చెట్టుకు కట్టేసి కొట్టారు. మూడు రోజుల క్రితం ఈ దారుణం జరిగింది. రామారెడ్డి మండలానికి వలస వచ్చి బతుకుతున్న జంటపై తొలుత దాడి చేశారు. ఇక్కడ్నుంచి మాచారెడ్డి మండలంలోని మరో గ్రామానికి బాధిత జంటను పట్టుకెళ్లి అక్కడే చెట్టుకు కట్టేసి కొట్టారు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడగా మరుసటి రోజు వారిని కొందరు దవాఖానకు తీసుకెళ్లినట్టు తెలిసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో చెలరేగిన వివాదంతో ఇదంతా జరిగినట్టు సమాచారం. అయితే, ఈ దారుణంపై పోలీసులు నోరు మెదపడం లేదు.

అందుకే కేసు లేదు..

దాడికి పాల్పడింది కాంగ్రెస్ పార్టీకి చెందినవారని గ్రామస్థులు చెప్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారు కావడంతోనే పోలీసులు కేసు నమోదు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నట్టు తెలిసింది. ఈ ఘటన బాహ్య ప్రపంచానికి తెలిస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే కారణంతో పోలీసులు జాగ్రత్త పడుతున్నట్టు సమాచారం. రామారెడ్డి, మాచారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ అమానవీయ ఘటనపై కేసు నమోదు చేశారా.. లేదా? అనేది తెలుసుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు స్పందించడం లేదు.

నేడు, రేపు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు వెరిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ఫిజికల్ డైరెక్టర్స్ ఇన్ స్కూల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు శుక్ర, శనివారాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిరుడు ఆగస్టులో ఈ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని చైతన్యపురి సోషల్ వెల్ఫేర్ మహిళా గురుకుల లా కాలేజీలో 1:2 పద్ధతిలో వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. www. treirb.telangana.gov.inలో ఉన్న ఒరిజినల్ పత్రాల రెండు సెట్ల జిరాక్స్‌లు, సెల్ఫ్ అటెస్టేషన్‌తో హాజరుకావాలని కోరారు.

గ్రామ కార్యదర్శే నోడల్ అథారిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం అమలుకు గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ కార్యదర్శిని నోడల్ అథారిటీగా నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్థాయిలో లబ్ధిదారుల ఎంపికను పంచాయతీ కార్యదర్శులు చేపట్టాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

హౌసింగ్ బోర్డు భూములను పరిరక్షిస్తాం

- జియో ఫెన్సింగ్, కాంపౌండ్ వాల్స్ నిర్మిస్తాం: కమిషనర్ విజయేంద్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): 'హౌసింగ్ బోర్డ్ ఫర్ సేల్' పేరుతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హౌసింగ్‌బోర్డు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు హౌసింగ్ కమిషనర్ బీ విజయేంద్ర తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

ఇందులో భాగంగా భూములను జియో ఫెన్సింగ్ చేయడంతోపాటు ప్రహరీ నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని విలువైన భూముల పర్యవేక్షణలో లోపం ఉందని, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్టు పేర్కొన్నారు. బోర్డుకు రావాల్సిన లీజు బకాయిలు, పెండింగ్ కేసులు, ఇతర అంశాలపై ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు చెబుతూనే, హౌసింగ్‌బోర్డు భూములు విక్రయిస్తున్నట్టు 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంలో వాస్తవం లేదని వివరణ ఇచ్చారు.

ఈఎన్సీ జనరల్ మురళీధర్ రాజీనామా

- అనిల్‌కుమార్‌ను నియమించే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ జనరల్ పదవికి సీ మురళీధర్ గురువారం రాజీనామా చేశారు. ఆ స్థానంలో ఈఎన్సీ జనరల్‌గా, ప్రస్తుతం ఈఎన్సీ అడ్మిన్‌గా కొనసాగుతున్న అనిల్‌కుమార్‌ను కొత్తగా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరిగేషన్ శాఖలో ప్రస్తుతం ముగ్గురు సీనియర్లు ఉన్నారు. వారిలో అనిల్‌కుమార్, ఓఅండ్‌ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు, కాళేశ్వరం ఈఎన్సీ హరిరాం ఉన్నారు. హరిరాం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును పక్కనపెట్టినట్టు సమాచారం. మరొక ఈఎన్సీ నాగేందర్‌రావు ప్రాజెక్టుల నిర్మాణం, అంతర్రాష్ట్ర జల వివాదాలు, డ్యామ్ సేఫ్టీ, అడ్మిన్ ఇలా అన్ని విభాగాల్లోనూ పట్టుంది. అయితే మే నెలలో ఉద్యోగ విరమణ పొందాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ఆయన పేరునూ పరిగణనలోకి తీసుకోనట్టు సమాచారం. అనిల్‌కు సైతం మరో ఏడాదిన్నర సర్వీస్ ఉండడంతోపాటు పెద్దగా వివాదాలు లేవు. ఈ నేపథ్యంలో ఆయననే ఈఎన్సీగా నియమించేందుకు సర్కారు సమాలోచనలు చేస్తున్నది.

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు అనుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ.2945.50 కోట్లతో ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చింది. దీంతో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ ఎత్తిపోతలకు సంబంధించిన సర్వే, డిటైల్డ్ ఇన్వెస్టిగేషన్, డిజైన్ల అమలుకు పరిపాలనా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే వీలుంటుంది.

ఏపీ న్యాయవాదులను తొలగించాలి

- తెలంగాణవారినే జీపీ, పీపీలుగా నియమించాలి
- అడ్వకేట్ జనరల్‌కు హైకోర్టు జేఏసీ వినతి

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందిన న్యాయవాదులనే ప్రభుత్వ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్టాండింగ్ కౌన్సిలర్లుగా నియమించాలని హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిని తెలంగాణ హైకోర్టు జేఏసీ కోరింది. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేసింది. ప్రస్తుతం నియమితులైన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు కొందరున్నారని, వారిని తొలగించాలని కోరారు. జీవో 66 కింద ఐదుగురిని ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్లుగా ఎంపిక చేసిందని, వారిలో నలుగురు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వారేనని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది గుంటూరు జిల్లా వాసి అని తెలిపారు. రాష్ట్ర విభజన నిబంధనల ప్రకారం ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని నియమిస్తే తెలంగాణ ప్రాంతానికి చెందిన న్యాయవాదులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏపీ న్యాయవాదుల పేర్లను తొలగించాలని కోరుతూ ఇటీవల న్యాయవాదుల సంఘం భారత ప్రధాన న్యాయమూర్తికి సైతం ఫిర్యాదు చేసిందని తెలిపారు.